# కేసీఆర్‌తోనే ఎరుకలకు గుర్తింపు

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- సీఎం కేసీఆర్‌కు ఎరుకల మద్దతు
- గజ్వేల్‌లో జిల్లా స్థాయి ఎరుకల ఆత్మీయ సమ్మేళనం


గజ్వేల్‌లో ఎరుకల ఆత్మీయ సమ్మేళనంలో విల్లు ఎక్కుపెడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

గజ్వేల్ అర్బన్, నవంబర్ 7: దశాబ్దాలుగా అభివృద్ధిలో వెనుకబడ్డ ఎరుకలను సీఎం కేసీఆర్ గుర్తించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్సీ కుర్ర సత్యనారాయణ, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూదాడి రాములు అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో సిద్దిపేట జిల్లా ఎరుకల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకల సామాజికవర్గానికి చెందిన వక్తలు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో ఎకరం స్థలంలో రూ.5 కోట్లతో ఎరుకల ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. రాష్ట్రంలో 200 ఎరుకల సొసైటీలను ఏర్పాటు చేశారని, ఒక్కో సొసైటీకి రూ.60 లక్షలు కేటాయించి ఎరుకల ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డారన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం అయితే ఎరుకల జీవితాలు బాగుపడతాయని తేచ్చిచెప్పారు. ఎరుకలంతా సీఎం కేసీఆర్‌కు మద్దతు ఇస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కుర్ర సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు రాములు తెలిపారు. అనంతరం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 50వేల ఎరుకల కుటుంబాలు పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయని, ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీం కింద వారి ఆర్థికాభివృద్ధికి రూ.60కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎరుకల అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు తోడుగా ఉంటారని తెలిపారు. సీఎం కేసీఆర్ వెంటే మనమంటూ నాయకులు పిలుపునివ్వగా సభలో ఉన్న ఎరుకలంతా జై కేసీఆర్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభలో ఎరుకలసాని కేసీఆరే మళ్లీ సీఎం అంటూ జ్యోతిష్యం చెప్పడంతో మరోసారి సభ నుంచి జై కేసీఆర్ అంటూ నినాదాలు వినిపించాయి. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎరుకల సంఘం గుర్తు అయిన విల్లుతో బాణాన్ని ఎక్కుపెట్టి సంధించి ఈ ఎన్నికల్లో కేసీఆర్ భారీ మెజార్టీతో గెలిచి మూడోసారి హ్యాట్రిక్ సీఎం కానున్నారని చెప్పారు. మహిళలతో కలిసి గులాబీ జెండలమ్మ పాటకు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణతో కలిసి డ్యాన్స్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, ఎల్లేశ్, హౌసింగ్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, తెలంగాణ ఎరుకల సంఘం ప్రధాన కార్యదర్శి కూరాకుల సాయి, ఆయా మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీలసారం ప్రవీణ్, గజ్వేల్ మండలాధ్యక్షుడు వెంకటసాయి, ఎరుకలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఎరుకలు

# మంత్రిని కలిసిన కొల్గూర్ క్రైస్తవులు


హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావుతో కొల్గూర్ క్రైస్తవులు

గజ్వేల్, నవంబర్ 7: ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావును మండల పరిధిలోని కొల్గూర్ గ్రామానికి చెందిన క్రైస్తవులు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ మద్దతు సీఎం కేసీఆర్‌కే ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఓటు కేసీఆర్‌కే పడేలా చూడాలని, ఒక్క ఓటు కూడా ఇతరులకు పోవద్దన్నారు. గజ్వేల్‌లో క్రైస్తవుల కోసం భవననిర్మాణం చేపట్టామని, అందరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. గజ్వేల్‌లో గత ప్రభుత్వాల హయాంలో ఎలాంటి అభివృద్ధి లేదని, కేసీఆర్ కృషితో గజ్వేల్ రేపురేఖలే మారిపోయాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొడుగు జ్యోతిస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేశ్, నాయకులు ఆంజనేయులు, అనిల్, గణేశ్, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# బీఆర్‌ఎస్‌లో చేరికలు

బెజ్జంకి, నవంబర్ 7: మండల కేంద్రంలోని గౌడ, రెడ్డి, బేడ బుడిగ జంగం, ఆరె సంక్షేమ సంఘాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు మంగళవారం భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, తిరుపతి, నరేశ్, మల్లేశం, రమేశ్, నర్సింహారెడ్డి, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


నాయకులకు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న గిరికుమార్‌గౌడ్

### గులాబీ గూటికి గిరికుమార్

కొమురవెల్లి, నవంబర్ 7: మండలంలోని గురువన్నపేటకు చెందిన కాంగ్రెస్ జిల్లా యువ నాయకుడు బుడిగె గిరికుమార్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గిరికుమార్‌కు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. గిరికుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసే పార్టీలో చేరానని, బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.


కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్

# ఆరు గ్యారెంటీలతో ఆగమే..

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 7: ఆరు గ్యారెంటీల పేరుతో దొంగ మాటలు చెప్పి ఊళ్లలోకి వస్తున్న పగటి బిచ్చగాళ్ల మాటలు నమ్మి ఆగం కావొద్దని ప్రజలకు మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. మంగళవారం మండలంలోని మక్తపల్లి, నల్లగొండ, సాహెబ్‌పల్లి, బాలయ్యపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లగొండకు చెందిన కాంగ్రెస్ నాయకులు 30 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఇక్కడి ప్రజలు సాగునీరు లేక ఉన్న ఊరును, కన్నవాళ్లను వదిలి గల్ఫ్ దేశాలు, బొంబాయికి బతుకుదెరువు కోసం వెళ్లారని, కేసీఆర్ సీఎం అయ్యాక కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఘలక్షలాది ఎకరాలకు సాగునీళ్లు అందించి రైతులను కంటికిరెప్పలా కాపాడుకుంటున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. కారు గుర్తుపై ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**


బూరుగుపల్లిలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 7: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, అర్హులైన పేదలకు న్యాయం జరగాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగుపల్లి, దాచారం, అనంతరావుపల్లి, పిడిచేడ్, బెజుగామ, ర్యాగట్లపల్లి, బయ్యారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ రోడ్‌షో నిర్వహించారు. బూరుగుపల్లిలో మహిళల బోనాలు, మత్స్యకారుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లతో ఒగ్గు కళాకారుల నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో పేదల సంక్షేమానికి దోహదపడుతున్నదన్నారు. గజ్వేల్ మండలంలోని అన్ని గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, ఫ్యాక్స్ చైర్మన్ వెంకటేశంగౌడ్, సర్పంచ్ విజయవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు, వైస్ ఎంపీపీ కృష్ణ, సమన్వయ కమిటీ సభ్యులు రవీందర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య, రఘుపతిరెడ్డి, రమేశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# నాలుగో రోజు నామినేషన్ల జోరు

సిద్దిపేట, నవంబర్ 7: నాలుగో రోజు మంగళవారం సిద్దిపేట నియోజకవర్గ స్థానానికి ఐదు నామినేషన్లు దాఖలైనట్లు సిద్దిపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ తన తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. చిన్నకోడూరు మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన ధర్మాజీపేట ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట పట్టణం గాంధీనగర్‌కు చెందిన జక్కుల సత్య నారాయణ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. మరో ఇద్దరు అభ్యర్థులు పిల్లి సాయికుమార్, పైసా రామకృష్ణ రెండో సెట్ నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమేశ్‌బాబు తెలిపారు.

**దుబ్బాకలో నాలుగు నామినేషన్లు**

దుబ్బాక, నవంబర్ 7: దుబ్బాక శాసనసభకు పోటీ చేసేందుకు మంగళవారం మరో 4 నామినేషన్లు దాఖలయ్యాయని దుబ్బాక రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 9 మంది అభ్యర్థులకు సంబంధించి 10 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో బీజేపీ అభ్యర్థి రఘునందన్ 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం దుబ్బాక ఆర్వో కార్యాలయంలో బీఎస్పీ(బహుజన సమాజ్ పార్టీ) అభ్యర్థి సలకం మల్లయ్య, యుగ తులసీ పార్టీ తరపున ఆది వేణుగోపాల్(దౌల్తాబాద్), బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు, ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా దుత్వల నరేశ్(నార్సింగ్) నామినేషన్ పత్రాలను ఆర్వో గరీమా అగర్వాల్‌కు అందజేశారు.

**గజ్వేల్‌లో ఆరు నామినేషన్లు దాఖలు**

గజ్వేల్, నవంబర్ 7: గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి మంగళవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన సదానందరెడ్డి(స్వతంత్ర), ములుగు మండల క్షీరసాగర్‌కు చెందిన బొగ్గుల రాజు(స్వతంత్ర), ఈటెల రాజేందర్(బీజేపీ), ఈటెల జమున, ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కరుణాకర్‌రెడ్డి(స్వతంత్ర), సిద్దిపేటకు చెందిన మద్దెల నర్సింలు(స్వతంత్ర) నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి బన్సీలాల్‌కు సమర్పించారు.